'స్వాతి' వారపత్రిక - 26.2.1999

# ఆనందం

వర్షాకాలం. సమయం ఉదయం. శుభోదయం. చైతన్యంలో జగతికి ఉదయోల్లాసం. బద్ధకంగా వుండి మంచంపై నుంచి లేవకుండానే ప్రసాద్ పరవశించిపోతున్నాడు.

ఉషోదయాలూ, వెండి జలతారు మబ్బులూ, మంచుకొండలూ, కోనలూ, సెలయేళ్ళూ, పచ్చిక బయళ్ళూ, వసంత వీచికలూ, మల్లెల మొగ్గలూ... అన్నీ అతను కప్పుకున్న దుప్పటిలోనే వున్నాయి.

ప్రసాద్ అంతగా పరవశించిపోవడానికి కారణం వుంది. ఆ రోజుకొక ప్రత్యేకత వుంది. విశేషం వుంది. ఏడాది క్రితం ఆ రోజునే సంధ్యను పెళ్ళాడేడు. ఆ రోజు నుంచే తన జీవితంలో సుఖానుభూతి, బతుక్కి సార్ధకత. అంచేత పెళ్ళిరోజంతా సంధ్యే ప్రపంచం. తను సంధ్యకే ప్రత్యేకం. పరిమితం.

డ్యూటీ గీటీ జాన్‌తా నై. మిగతా ప్రపంచంతో సంబంధం కట్. జగత్తులోని ఆనందాన్ని, సుఖాన్ని కేవలం తనూ సంధ్యా జుర్రేయాలి. పెళ్ళిరోజు నాడు ప్రతి గడియ ఎలా గడపాలో.. వారం రోజులు కష్టపడి ఓ ప్రణాళిక సిద్ధం చేశాడు. కార్యక్రమమంతా వరుసక్రమంలో కాగితంపై రాసుకున్నాడు. గత రాత్రే ఆ కాగితం చూపించి సంధ్యని సర్‌ప్రైజ్ చేశాడు.

సంధ్య నిజంగానే ఆనందాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బయింది. రోదసీలో విహరించింది. ఆ వెంటనే గాలి తీసిన బెలూన్‌లా చప్పబడింది. నీరసపడి పోయింది. ఏమంటే ఒకరోజు ఆనందానికయ్యే ఖర్చు ఇంచుమించు ఆరు వందల రూపాయలు!

"నాకొద్దుబాబు. నేను రాను. ఒక్కరోజుకి తగలేసే డబ్బుతో ఇంట్లో పది, పన్నెండు రోజులు పొయ్యి వెలిగించవచ్చు" - అంచేత వద్దంది సంధ్య.

వద్దన్న సంధ్యని అతి తక్కువ సమయంలోనే ప్రసన్నం చేసుకున్నాడు ప్రసాద్. తనేం తప్పు చేయలేదనీ, అప్పు చేయలేదనీ చెప్పేడు. రెండు నెలల క్రితం బాస్ ఇచ్చిన బోనస్‌ని దీనికి జాగ్రత్త పరిచేనని చెప్పేడు. ఎప్పుడూ సమస్యలూ, సత్తుగిన్నెలూ అనుకుంటే ఎట్లా? ఏడాదికొక్కరోజైనా రోటీన్‌కి భిన్నంగా, ఆనందంగా గడపని బతుకు ఏల?

చివరికి ఆమె ఒప్పుకుంది. తర్వాత వాళ్ళిద్దరూ ఆ లిస్టుపై చాలాసేపు చర్చించేరు. ఆమె రెండు, మూడు సవరణలు ప్రతిపాదించింది. ఆమోదించేడు. ఆ లిస్టులో సిగ్గు లేకుండా వ్రాసిన చివర కార్యకలాపాలని సిగ్గుతో, నవ్వుతూ తోసిపుచ్చింది. ఆ రోజు అతని జీవితంలో ఎప్పుడూ జరగనిది జరగబోతోంది. ఆ లిస్టులో సంక్షిప్తంగా కొన్ని విషయాలు...

భార్యాభర్తలిద్దరూ ఆ రోజు ఇంట్లో టిఫిన్ చేయరు. భోజనం తినరు. చివరికి పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టరు. అంతా ఖరీదైన హోటల్స్‌లోనే మజా! టిఫిన్‌కి ఏ హోటల్‌కి వెళ్ళాలి. వెళ్ళి ఏ అయిటమ్స్ తినాలి. తిన్నాక ఏ గుడికి వెళ్ళాలి. గుడి నుంచి సరాసరి ఏ సుందర ప్రదేశం దర్శించాలి.

మధ్యాహ్నం ఏ హోటల్లో పసందు విందు ఆరగించాలి. భుక్తాయాసంతో ఎంచక్కా ఎయిర్ కండిషన్డ్ హాల్లో కూర్చొని ఏ చక్కటి చిత్రం చూడాలి. సాయంత్రం ఎక్కడ విశ్రమించాలి.

తర్వాత డిన్నర్ ఇంకొత్త హోటల్లో మస్తుగా తిని, తృప్తిగా త్రేన్చి హాయిగా ఇంటికి చేరుట. చేరి బడలిక తీరేటంతగా వెచ్చగా, సుఖంగా ఇద్దరూ కలిసి స్నానం చేయుట. స్నానం చేసేటప్పుడు.. చేసిన తర్వాత... రాయడానికి వీలుకాని విషయాలు.. తలపుకొచ్చి దుప్పటిలో కలలు కంటున్న ప్రసాద్‌కి ఏదో పారవశ్యం. తీయని తిమురు.

టైమవుతోంది. ఉదయం ఎనిమిది గంటలకల్లా కొత్త బట్టలతో ముస్తాబై ఇంటి నుంచి కోరుకున్న ప్రపంచంలో అడుగెట్టాలి. అంచేత –

సంధ్య అతణ్ణి నిద్రలేపడానికి మంచం వద్దకు చేరింది. ఆమె అటూ, ఇటూ చూసి నెమ్మదిగా నడుం వంచి అతని ముఖంపై వంగింది.

అలా వంగటం చేత తలంటుకుని బారుగా ఆరేసుకున్న ఆమె ముంగురులు అతని ముఖంపై తెరలు తెరలుగా, సాంబ్రాణి వాసనతో పడి గిలిగింతలు పెట్టి కలల ప్రపంచం నుంచి మేలుకొల్పింది.

ఆమె శ్వాస సుగంధ శీతల సమీరంలా తాకింది. అతని పెదాలను చుంబించింది. అరక్షణమే. అయితేనేం? చాలది. అతనికది అమృతం. రోజంతటికి సరిపడేంత శక్తినిస్తుంది. అతనికిప్పుడు తెల్లవారింది.

హుషారుగా కళ్ళు తెరిచేడు ప్రసాద్.

ఓహ్! ముగ్ధమోహన అద్భుత సౌందర్యం.

ఇన్నాళ్లూ ఆమె అందాలను సరిగ్గా దగ్గరగా చూడలేనట్టుగా తోచింది. సంధ్య తనకీ రోజు మళ్ళీ ఒక కొత్త పెళ్ళికూతురిలా కనిపిస్తోంది. తాపంతో, తమకంతో సంధ్యను దగ్గరకి తీసుకోబోయేడు.

చిన్న దగ్గు!

పార్వతమ్మ వచ్చింది. ఆమె ప్రసాద్ కన్నతల్లి. ఆమె ముసిముసిగా నవ్వుకుంటూ ఆ

గదిని గబగబా దాటి వంటగదిలోకి వెళ్ళిపోయింది. వంటగదికి మరో మార్గం లేదు. తప్పనప్పుడు మాత్రమే ఆమె ఆ గదిని క్రాస్ చేస్తుంది. వచ్చేటప్పుడు ముందుగా తప్పకుండా ఏదో చిన్న చప్పుడు, సంకేతం పంపిస్తుంది.

కొడుకూ, కోడలూ సరదాగా వుంటే ముచ్చటపడే అత్తగారే పార్వతమ్మ. తను ఆమడ దూరంలో వుండి వాళ్ళకు ఎంతో కొంత ఏకాంతం ఇచ్చే ప్రయత్నంలోనే వుంటుంది.

కొడుకు ఇంట్లో వున్నంత సమయం ఆమె ఆ గదిలోకి రాదు. సంధ్యను తప్ప మరొకరిని వెళ్ళనీయదు. మరొకరు అంటే ఆమె భర్త వెంకటరావు. అతను ఇంటికి భోజనానికి, నిద్రకి మాత్రమే వస్తాడు.

ప్రసాద్ నూతన వస్త్రాలు ధరించి తయారయ్యేటప్పటికి ఉదయం ఎనిమిది గంటలయింది. సంధ్య అప్పటికే ముస్తాబై వున్నది.

తల్లిదండ్రుల కాళ్ళకి నమస్కరించేరు.

ఇక ఆ రోజు ఆలుమగలిద్దరూ పుష్పక విమానంపై మబ్బుల్లోంచి స్వర్గపుటంచులను తాకుతూ సుమధుర లోకాలకు సాగి పారవశ్యంతో తేలియాడటమే తరువాయి –

చప్పుడు చేస్తూ ఇంటి ముందు ఒక వాహనం ఆగింది! అది పుష్పక విమానం కాదు. కంపెనీ జీపు.

అంతే! ప్రసాద్ నిశ్చేష్టుడయ్యాడు.

ఇంటిల్లిపాది నిర్ఘాంతపోయారు.

ఆ వాహనం రాకకి సమయం అప్పుడూ ఇప్పుడూ అని లేదు. ఎప్పుడు పడితే అప్పుడు ప్రత్యక్షమవుతుంది. మరుక్షణం ప్రసాద్‌ని తీసుకుపోతుంది. అందుకెప్పుడూ సిద్ధమే ప్రసాద్. అర్ధరాత్రి అపరాత్రి అయినా విసుక్కోకుండా బద్ధకించకుండా బయల్దేరుతాడు. ప్రసాద్ డాక్టరు కాదు. మేనేజింగ్ డైరెక్టరూ కాదు. సామాన్యమైన వర్కర్. గ్రేడ్ వన్ మెకానిక్.

ఆ కంపెనీ ఒక ప్రాసెస్ ప్లాంటు.

మూడు షిఫ్టులతో ప్లాంటు ఆగకుండా పనిచేస్తుంది. ఎక్కడ ఏ యంత్రం చెడిపోయినా మొత్తం సిస్టం ఆగిపోతుంది. ప్రొడక్షన్ దెబ్బతింటుంది.

ఆ కంపెనీలో ఇంజనీర్లూ, సూపర్‌వైజర్లూ లేక కాదు. వాళ్ళకి టెక్నాలజీ తెలుసు. మానేజింగ్ ది సిట్యుయేషన్ తెలుసు. రిపేర్ వస్తే ఏం చేయాలో తెలీదు. ప్రసాద్‌ని ఇమీడియేట్‌గా ఎంగేజ్ చేయడమే వాళ్ళకి తెలిసిన మేనేజ్‌మెంట్. మరో మార్గాంతరం లేదు. నో ఆల్టర్‌నేటివ్! అదీ ఆ కంపెనీ పరిస్థితి.

ఆగిపోయిన ఏ మిషనరీ అయినా ప్రసాద్ చేయి వేస్తే పెంపుడు కుక్కల్లా మాట వింటాయి.

అతనికి కూడా మిషన్లంటే అంతే ప్రేమ. ఎక్కడ ఏ బోల్టు ఏ నట్టు వుందో అతనికి తెల్సినట్టుగా మరెవరికీ తెలీదు. పనిముట్లతో యంత్రాల మధ్యకి దిగితే అతనికి సమయం తెలీదు. పనికి రాక్షసుడు. యంత్రం లొంగేకే అతను మామూలు మనిషి అవుతాడు. ఈ

ప్రపంచంలోకి వస్తాడు.

అలాంటి ప్రసాద్ ఆ రోజు అందుకు సిద్ధంగా లేడు. తుపాకీ పేల్చినట్టుగా "నేను రాను" అని వెనుకేకతో డిక్లేర్ చేశాడు ప్రసాద్. జీప్‌ని తక్షణమే వెనుతిరిగి వెళ్ళిపోమన్నాడు.

ప్రసాద్ నెగెటివ్ ప్రవర్తనకి జీపు విస్మయం చెంది నీరసంగా అక్కడి నుండి కదలబోతుంటే – సంధ్య జీపుని చేతి సౌంజ్ఞలతో ఆపింది.

ఆమె ప్రసాద్‌ని నెమ్మదిగా శాంతింపజేసింది.

"నా మాట వినండి. మీరు వెళ్ళి వచ్చేస్తే అరగంట పని. కాదని వెళ్ళకుంటే రోజంతా అశాంతి. ఏదీ తృప్తిగా ఆనందించలేము. తర్వాత అది దేనికి దారితీస్తుందో తెలీదు. అకస్మాత్తుగా మీరిలా డ్యూటీకి వెళ్ళాల్సిన పరిస్థితికి నేనెలాంటి నిరాశ నిస్పృహలకు లోనుకావడం లేదు. మీరూ కావొద్దు. మనం వేసుకున్న ప్రోగ్రామ్ అటూ ఇటూ కావొచ్చు తప్ప భగవంతుడు కూడా ఈ రోజు మన ఆనందాన్ని అడ్డుకోలేడు. దయచేసి నా మాట విని బయల్దేరండి. చెబుతున్నానుగా మళ్ళీ మీరు అరగంటలో ఇక్కడ వుంటారు"

ప్రసాద్ యూనిఫారం వేసుకోలేదు. పెళ్ళిరోజుకి ధరించిన కొత్త దుస్తులతోనే జీపు ఎక్కేడు.

❁ ❁ ❁

ప్రసాద్ కోసం ఎదురుచూస్తున్న సంధ్య కళ్ళల్లో దీపాలు. ఆమె నిరీక్షిస్తుండగా ప్రసాద్ వచ్చేశాడు. సమయం ఎనిమిది గంటలు. ఉదయం కాదు. రాత్రి!

ఆమె అనుకున్నట్టుగా ప్రసాద్ అరగంట, గంటలో తిరిగి రాలేకపోయేడు. చెడిన యంత్రం ముప్పుతిప్పలు పెట్టి అతనికి టైమ్ తెలియనీయలేదు.

అతని చేతులు పడితే చైతన్యంతో విరగబడి పరుగులు పెట్టే యంత్రం ఆ రోజు పూర్తిగా మొండికేసింది. మొరాయించింది.

చివరికి యంత్రం లొంగిపోయింది. అప్పుడు సమయం ఆరు గంటలు. తను వెళ్ళేక... మళ్ళీ అల్లరి పెడుతుందేమోనని మరో గంట వెయిట్ చేశాడు. మెషిన్ గుడ్ రన్నింగ్‌లో వుందని కన్‌ఫర్మ్ అయ్యేక అక్కడి నుంచి కదిలేడు. కంపెనీ యజమాని ప్రసాద్‌ని తన రూమ్‌కి పిలిచి అభినందించేడు.

"నీ పెళ్ళిరోజు ఈ రోజేనని నా కిప్పుడే తెలిసింది. తెలిసినా, తెలియకపోయినా నేనేం చేయగలను? నేరం నాది కాదు మెషిన్‌ది. నీ సరదా పాడు చేసింది నేను కాదు పాడు యంత్రం.

యంత్రాలకి మంత్రం వేయవలసింది నీవు తప్ప నేను కాదు. మెషిన్లని నీవు కండిషన్‌లో పెట్టకుంటే అవి నిన్నే కండిషన్ చేస్తాయి.

అర్థరాత్రి, అపరాత్రి అనకుండా నీవు పెళ్ళాం పక్కలోనున్నా క్రూరంగా నిన్ను లాక్కెళ్ళిపోతాయి. పుట్టిన రోజులూ, పెళ్ళిరోజులూ, పండుగలూ, ఆనందాలూ, సరదాలూ

సమస్తం నిర్దాక్షిణ్యంగా యంత్రం పళ్ళ కింద నలిగి పిప్పయిపోతాయి.

అంచేత నేను చెప్పేదేమిటంటే మెషిన్లు నావి కావు. నీవి. వాటిని నీవు ఎప్పటికప్పుడు కండిషన్‌లో వుంచుకుంటే నీకిలాంటి తిప్పలు వుండవు" - ఇంచుమించు అలాగే తెలియజేశాడు యజమాని.

'నా శ్రమను పిండి ఖర్చు లేని అభినందనలు చెబుతావు తప్ప మరో మెకానిక్‌ని రిక్రూట్ చేసి నా లోడ్ తగ్గించవు. పాత మెషిన్లను జాగిలాల్లా నాపై వదిలేస్తావు తప్ప కొత్తవి కొనవు. నాకు తిక్కరేగేవరకూ ఇలాగే నాటకాలు ఆడుతావు' - అన్లేదు ప్రసాద్.

ప్రసాద్ పెళ్ళిరోజుకి శుభాకాంక్షలు తెలియజేసేడు యజమాని. తెలియజేస్తూ ఒక ఖరీదైన విదేశీ పుస్తకం అతని చేతిలో పెట్టేడు. ఆ పుస్తకం ఆసరాతో రాత్రంతా ఆనందంగా భార్యతో గడిపి - మరుసటి రోజు జాగ్రత్తగా తిరిగి ఆ పుస్తకాన్ని తీసుకొచ్చేయమన్నాడు.

పుస్తకం తెరవగానే మతిపోయింది ప్రసాద్‌కి. బూతు బొమ్మలు. పుస్తకం అంతా అవే! సిగ్గుపడి, కృతజ్ఞతలు చెబుతూ మర్యాదగా తిరిగి ఇచ్చేశాడు ప్రసాద్.

యజమాని తెల్లబోయి చూస్తుండగా, చేతులెత్తి నమస్కరించి బయటకు వచ్చేశాడు. చూసిన రెండు, మూడు పేజీలు అతన్ని డిస్టర్బ్ చేశాయి.

తిరిగి ఇంటికెళ్ళేందుకు ప్రసాద్ జీప్‌ని అడగలేదు. యజమాని ఇవ్వనూ లేదు. సిటీబస్‌పై ఇంటికి చేరేసరికి రాత్రి ఎనిమిది దాటింది. ఆ రాత్రే పుస్తకం విషయం సంధ్య చెవిలో వేశాడు.

"ఛీఛీ! బుద్ధిలేని మనుషులు! అది తెచ్చుంటే నేను చించిపారేద్దును" అంది సిగ్గుతో చితికిపోతూ, చిరుచిరుగా నవ్వుతూ.

"నేను బుద్ధిమంతుణ్ణి. అందుకే తేలేదు. నాకేం లోటని ఆ పుస్తకం అవసరం? నీవే నాకు ఆ బొమ్మల పుస్తకానివి. కాదా?"

సంధ్య కోపం నటిస్తూ ఒళ్ళంతా చీర కప్పుకుంది. పకపకా నవ్వేడు ప్రసాద్.

ప్రసాద్‌కి ఆ రోజు నిజంగా ఆనందంగా వుంది.

చెడిన యంత్రాన్ని విజయవంతంగా రన్నింగ్‌లో పెట్టడమే సరైన పెళ్ళిరోజు గిఫ్ట్!

ఆ విషయంలో అతను పొందిన తృప్తి ఆమె గమనించింది. అతని తృప్తే ఆమెకు ఆనందం.

ప్రసాద్ ఇంటికి రాగానే - "సంధ్య! ఆకలిగా వుంది తొందరగా అన్నం పెట్టు" అన్నాడు.

ఆమె చలించిపోయింది.

అన్నంతో పచ్చడి, చారు, పెరుగు చాలు.

అతనికి అమృతం.

అయితే ప్రసాద్ ముందు చికెన్ బిరియానీ, మటన్ కర్రీ, రొయ్యల వేపుడూ, గారెలూ, స్వీట్లూ, ప్రత్యక్షమయ్యేయి. అతను ఊహించనిది!

అతనితో సంధ్య, ఆమె అత్తామామ ఒకేసారి హాయిగా, సరదాగా, తృప్తిగా తిన్నారు.

సంధ్య చెప్పిన ప్రకారం బజారు నుంచి నాన్ వెజిటేరియన్ మావయ్య తీసుకురాగా వంటగదిలో అత్తగారు పూర్తిగా సహకరించగా మొత్తం వంటకాలను సంధ్య రుచిగా చేసింది.

ప్రసాద్ తండ్రి వెంటకరావు భోజనం అయిన వెంటనే నిద్రకి ఉపక్రమించేడు. అతని పక్క గ్రిల్స్‌తో క్లోజ్ చెయ్యబడ్డ వరండాలో ద్వారానికి అడ్డులేకుండా మూలకి వున్నది. గదిలో యువ దంపతులు సంధ్య, ప్రసాద్. గది తలుపులు లోన గడియ పడిన తర్వాత వరండాలో ద్వారం దగ్గర నేలపై బొంత వేసుకుని పడుకుంటుంది పార్వతమ్మ.

ప్రస్తుతం పార్వతమ్మ వీధి కుళాయి గట్టుపై ఆడవాళ్ళ కబుర్లు వింటూ కూర్చుంది.

స్నానం చేయాలనిపించింది ప్రసాద్‌కి.

ప్లాంట్ నుంచి రాగానే స్నానం చేసి కంచం ముందు కూర్చుందామనుకున్నాడు. కానీ రోజంతా భోజనం లేదేమో.. ఆకలి డామినేట్ చేసింది.

ఆకలి తర్వాతే స్నానం, సుఖం అన్నీ.

చిరాకుగా వుండడంతో రెండు బకెట్ల నీళ్ళు బాత్రూమ్‌లో పెట్టమన్నాడు ప్రసాద్. సంధ్య ఒక్క క్షణం బిత్తరపోయి తర్వాత నవ్వేసింది.

"దొరగారు ఈ రోజు మన పెళ్ళిరోజన్న విషయం మరచినట్టున్నారు. నిన్న రాత్రి ఏమన్నారు? ఏమన్నారో మీ జేబులో భద్రంగా వున్న లిస్టు తీసి చదవండి. స్నానఘట్టం, ఒప్పుకునే వరకూ నా ప్రాణం తీసేశారు కదా" అంది సంధ్య.

ప్రసాద్ నాలిక కర్చుకున్నాడు.

"నీళ్ళు పెట్టమన్నది అందుకే" అని సర్దుకున్నాడు. ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు.

సంధ్య దూరంగా జరిగి – "ప్లేటు బాగానే తిప్పారు గాని, ఇంట్లో వున్న నీళ్ళు మనిద్దరం సరసాలాడుకుంటూ గుమ్మరించేసుకుంటే – రేపు వాడుకోవడానికి చెంబుడు నీళ్ళు కూడా మిగలవు" అంది.

గత దినం నీళ్ళు మున్సిపాలిటీ వాళ్ళు దయతలచి పోయలేదనే సంగతి అతనికి గుర్తుకొచ్చింది. ఆ ఇంట్లో నీళ్ళ అవసరం వీధి కుళాయి తీరుస్తుంది. బావి, బోర్‌వెల్ వగైరా సదుపాయాలు లేవు అక్కడ.

నీళ్ళు రావొచ్చని ఆశతో ఆ వీధివాళ్లంతా నిద్రలేమితో, లేదా కోడి కునుకుతో కాకుంటే కేబుల్ టీవీలో పాడు సినిమా చూస్తో పడిగాపులు.

గదిలో ఏకాంతం లభించినప్పటికీ.. పెళ్ళిరోజు నాడు భార్యాభర్తలు ఇద్దరినీ చెమట కంపు దూరంగానే వుంచింది. వాళ్ళిద్దరూ వచ్చే నీళ్ళ కోసం ఎదురు చూస్తూ వస్తున్న సినిమాని బ్లాక్ అండ్ వైట్ మినీ టీవీలో నిశ్శబ్దంగా చూస్తున్నారు.

అంతలో – వీధిలో చప్పుడు. ఆనందం చిచ్చుబుడ్డిలా ఎగిసింది ఆ ప్రదేశమంతా.

మున్సిపాలిటీ నీళ్ళు వేణునాదంలా శ్రావ్యంగా మోగి, కాలేజీ ఆడపిల్లల అల్లరిలా

తుళ్ళుతూ, దుముకుతూ అమాంతంగా రాసాగేయి. ధారగా నీళ్లు.

నీళ్ళు.. నీళ్ళు...

పార్వతమ్మ కుళాయి క్షేత్రంలో దిగి దుర్గాదేవిగా మారింది. ఆమె కప్పుడు అఖండ దివ్యశక్తి వస్తుంది. విజృంభించి విజయం సాధిస్తుంది.

కోడలు అబ్బురంగా అత్త సాహసాన్ని చూడగలగడమే తప్ప తను సాహసించలేదు.

తోసుకొస్తున్న, దూసుకొస్తున్న బిందెల్ని వీరావేశంతో అటాక్ ఇచ్చి తన బిందెకే నీళ్ళు కైవసం చేసుకుంటోంది. సంధ్య చాలా హుషారుగా, చలాకీగా వట్టి బిందెలను అత్తకి అందించి నిండు బిందెల్ని చంకనెత్తుకుంటోంది. పరుగున వెళ్ళి, మళ్ళీ వట్టి బిందెతో వస్తోంది అదే పరుగున! ఆ దృశ్యం ప్రసాద్ కెప్పుడూ మనోహరంగా వుంటుంది.

చంకలో బిందెతో సంధ్య వడివడిగా, వయ్యారంగా నడిచే నడక, అతని గుండెల్ని జల్‌జల్ మనిపించే మువ్వల పట్టీల సవ్వడి, ఆమె పొడవాటి వాల్జడ అటూ ఇటూ కదుల్తూ ఆమె కటిమీద కాకుండా అతని ఎదపై దరువేసే మన్మథ చప్పుడు, వడి వడి నడకకి చీర అడ్డు తగిలి కాళ్ళ మధ్య పడకుండా బొడ్డు దగ్గర దోపబడిన చీర కుచ్చిళ్ళూ, చూస్తూ వుండిపోవాలనిపించే గోరింటాకు పులుముకున్న చిరుపాదాలు, చెదిరిన ముంగురులు, జారే పమిటలోంచి మెరుస్తూ ఉబికే వక్షం, చెమటకో, నీళ్ళకో తడిసిన వయసు వంపులూ.. చూస్తూ వుండిపోవాలనిపిస్తుంది.

ప్రసాద్ ఆపాదమస్తకమూ ఉత్తేజం, ఆనందం. పౌడర్ అద్దుకుని, చెరగని జుట్టుతో, నలగని చీర కుచ్చెళ్ళతో కుందనపు బొమ్మలా నిలబడే అందం కన్నా, ఇంట్లో ఏదో పని చేస్తూ కనిపించే ఒంపు సొంపుల సహజ సౌందర్యం అతన్ని అలరిస్తుంది. ఆకర్షిస్తుంది. శ్రమ సౌందర్యం ఆకట్టుకుంటుంది.

సంధ్యని చూస్తూ వుండిపోకుండా తను కూడా నీళ్ళు పట్టడంలో సంధ్యకి సహకరించేదు ప్రసాద్. ఇంట్లో నీళ్ళకుండీ, డేగిసా, బిందెలూ, బకెట్లూ. చివరికి చిన్న చిన్న తపేలాలూ, చెంబులూ కూడా మినహాయింపు కాలేదు. సమస్తం నీళ్ళు. ఆ తర్వాతే కుళాయిలో నీళ్ళు బంద్ అయ్యేయి. మున్సిపాలిటీ వారికి ధన్యవాదములు మరియు కృతజ్ఞతలు.

సమయం ఒంటిగంట దాటింది.

వెంకటరావు అప్పటికే నిద్రిస్తున్నాడు. పార్వతమ్మ నేలపై వరండాలో బొంత పరుచుకుంది - సంధ్య గది తలుపులు లోన గడియ పెట్టిన తర్వాత.

ప్రసాద్ లిస్టులో రాసుకున్న చివరి రసవత్తర ఘట్టం.

ప్రసాద్ వయసు రెచ్చగొడుతున్నది.

అమృతభాండాన్ని జుర్రుకోమంటున్నది.

స్నానాల గదిలో సంధ్య వుంది.

ఆమె చాలాసేపు ప్రసాద్‌ని లోనికి ప్రవేశించడానికి అవకాశం ఇవ్వలేదు. అతని పోరు

పడలేక సిగ్గుతో గడియ తీసింది. వెంటనే లోనికి ప్రవేశించేడు.

అంతలో - తలుపుపై దబదబా చప్పుడు.

వయసు చేస్తున్న అలజడి తలుపు చప్పుడు వెంటనే వినబడలేదు. వినబడగానే టఫ్‌మని పొంగే పాల మీద నీళ్ళు చల్లబడ్డాయి.

లుంగీ చుట్టుకుని తలుపు గడియ తీసేడు ప్రసాద్.

గడియ తీయగానే పార్వతమ్మ, వెంకట్రావు మంచం, బొంత, దుప్పట్లతో ఒక్క ఉదుటున లోనికి తోసుకువచ్చేరు. వాళ్ళతో బాటు వర్షపు జల్లు కూడా లోనికి ప్రవేశించబోయింది - జబర్దస్తీగా, లోనికి వర్షాన్ని రానీయకుండా తలుపులు బిగించేడు.

బయట గాలీ, వర్షం జతకూడి రెచ్చిపోతున్నాయి - కుండపోతగా. పది నిమిషాల్లో అందరి పక్కలూ ఆ సింగిల్ రూమ్‌లోనే అమిరేయి.

మామూలు రోజులు సరే. పెళ్ళిరోజునాడు కొడుకూ కోడలి ఏకాంతానికి ఇబ్బంది కలిగించామనే బాధ ఆ వృద్ధ దంపతులకు కలిగింది. ఏం చేస్తారు? పాడు వర్షాన్ని తిట్టుకుని కిక్కురుమనకుండా, దుప్పటి కప్పుకుని ముడుచుకు పడుకున్నారు.

సంధ్య స్నానమాడి, తెల్లటి నేత చీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని వచ్చేటప్పటికి ప్రసాద్‌కి మరోసారి మతిపోయింది. మతి పోగొట్టుకోవడం తప్పించి ఏమి చేయగలడు? అతని ముఖం చూసి నిశ్శబ్దంగా కిసుక్కున నవ్వింది సంధ్య.

దీపం తీయబడింది. ప్రసాద్ కళ్ళు మూసుకున్నాడు. అతనికి చిరాకుగా వుంది. ఆమెను దగ్గరకి తీసుకోవడానికి భయపడ్డాడు.

చేయి వేస్తే ఇంకేం ప్రళయం వస్తుందో, లేదా పిడుగైనా పడవచ్చు. బుద్ధిగా పడుకోవడం నయం. అతనిలో ఎప్పుడూ లేనిది నిరాశా, నిర్వేదం. అతనిపై అతనికి చిరాకు, దు:ఖం.

సంధ్య చెవిలో నెమ్మదిగా అన్నాడు.

"సంధ్యా! ఈ రోజు మనం అనుకున్నది అనుకున్నట్టు జరగకపోయినా.. మరో విధంగా బాగానే సాగింది అనుకున్నాను.

చివరికి దయలేని మున్సిపాలిటీ వాళ్ళు కూడా దయతలచి మనం బ్రహ్మాండంగా ఆనందంలో మునిగితేలేటంతగా నీళ్ళు గుమ్మరించేరు.

భగవంతుడు మాత్రం నిర్దయుడు. ఎంతో హాయిగా సాగాలని మధురంగా ఊహించుకున్న రాత్రిపై ఇలా నల్లటి వర్షమేఘం కమ్మేస్తుందనుకోలేదు. తీయని కలను వెల్లువై తుంచేస్తుందనుకోలేదు" అని ప్రసాద్ బాధపడుతుంటే చలించి పోయింది సంధ్య.

అతన్ని దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా తలలోకి చేతివేళ్ళను పోనిచ్చింది. చప్పుడు చేయని ముద్దు పెట్టింది. ఆ గదిలో అంతకన్నా అవకాశం లేదు.

ఆ వెంటనే -

సంధ్య దిగ్గున పక్క మీంచి లేచింది. అతన్ని బలవంతంగా లేపింది. తనని ఫాలో

అవ్వమంది.

ఎక్కడికి?

స్వర్గపుటంచులకు, నింగీ నేల ఏకమయ్యే చోటుకీ, రంగు రంగుల హరివిల్లు విరిసే మెరిసే చోటుకి.

ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఆదరా బాదరగా గొడుగు తీసేడు ప్రసాద్.

ఇద్దరూ బయటకు వచ్చేరు. సంధ్య గది తలుపులు వేసింది. ఎందుకైనా మంచిదని తాళం కూడా.

వర్షంలో సంధ్య. గొడుగు కింద ప్రసాద్.

తడుస్తున్న సంధ్యను గొడుగులోకి లాగేడు. తుర్రుమంది సంధ్య. అతను వదలలేదు. గొడుగుకి అందకుండా పరిగెత్తింది. పరిగెడుతూ శ్రావణమేఘపు తొలకరి జల్లులా అల్లరిగా నవ్వింది. గొడుగుకి దొరక్కుండా మేడ మెట్లు ఎక్కింది.

ఆ సమయంలో వీచే గాలి అదుపులో వుండి, చల్లగా, హాయిగా వుంది.

వయసు కోరిక గుర్రమై పరిగెట్టేంత సరసపు స్థాయికి వర్షం ఉధృతి తగ్గింది. జల్లుజల్లుగా వయసుపై తుళ్ళితుళ్ళి పడుతోంది.

వర్షం సవ్వడి వీనులవిందుగా గంధర్వ గానంలా వుంది. అటు నుంచి నైట్‌క్వీన్ పరిమళం గుప్‌గుప్ మంటోంది. వాతావరణం గుబాళిస్తోంది.

సంధ్యను వెదుక్కుంటూ గొడుగు పట్టుకుని ప్రసాద్ మేడపైకి చేరేడు.

మసక చీకట్లో ఉరుము ఉరిమింది.

మెరుపు మెరిసింది.

మెరుపులో ఆమె నగ్నంగా పాలరాతి శిల్పంలా గోచరించింది. దిగ్భ్రమపరిచింది.

ఆమె నిజంగా బట్టలు విడిచిందో లేక విడవకుండానే విడిచినట్టు తడిసిన చీరలో కన్పిస్తున్నదో తెల్సుకోవడం అతనికే సాధ్యం.

వర్ష సౌందర్యం, జీవన మాధుర్యం మధ్య గొడుగుకి తావు లేదు. పక్కకి నెట్టబడింది. సంధ్య వర్షంలో పురివిప్పిన నెమలిలా విశాలంగా విప్పారి బారుగా చేతులు చాచింది. చాచిన చేతుల ఆనందాన్ని కోరుతున్నాయి. అందాల్ని అందుకోమంటున్నాయి.

కాంక్షతో జ్వలిస్తున్న ప్రసాద్ అయస్కాంతంలా స్పందించేడు. కౌగలింతలు. పులకరింతలు. పలవరింతలు. రగిలే వయసుకి వేడుకే వేడుకలు.

మిసమిస యవ్వనం మత్తుగా రాజ్యమేలిన తృప్తి. మరపురాని మధురానుభూతి. అపురూపమైన అనుభవం. తరించిపోయిన పెళ్ళిరోజు.

అరమరికలూ, బిడియాలూ, భయాలూ లేని అపూర్వమైన అనంతమైన పారవశ్యం.

హాయిగా కురుస్తున్న అమృతం.

వెచ్చగా తడుస్తున్న ఆనందం.